క్లుప్తంగా

షెడ్ల నిర్మాణం వేగవంతం చేయండి



నిడమానూరులో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్ పరిశీలిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: జాతీయ ఉపాధి పథకం, పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణలో చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి సిబ్బంది రివ్యూ సమావేశంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిడమానూరులో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్‌ను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, ఏపీఓ రవి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లున్నారు.

రిలీఫ్ జమ చేయించండి



డీఆర్‌ఓ ఓబులేసుతో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు సిటీ: ఎస్సీ,ఎస్టీ కేసుల్లో బాధితుల అకౌంట్లలో రిలీఫ్ జమ చేయించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. మంగళవారం నూతన డీఆర్‌ఓగా నియమితులైన ఓబులేసును నీలం నాగేంద్రరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ పెండింగ్ ఫైళ్ల గురించి, రిలీఫ్ మంజూరులో జరుగుతున్న జాప్యం గురించి డీఆర్‌ఓతో చర్చించినట్లు తెలిపారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు రిలీఫ్ చెల్లించాలంటే సుమారు రూ. 5 కోట్లు అవసరమన్నారు. నేరం జరిగిన తేదీని బట్టి సినియారిటీ లెక్కించి బాధితులకు రిలీఫ్ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు త్వరగా రిలీఫ్ వచ్చేలా చర్యలు తీసుకుంటానని డీఆర్‌ఓ ఓబులేసు తెలిపారు. గిరిజన నాయకులులగంటాసుబ్బారావు, పాల్గొన్నారు.

శనగలో విత్తన శుద్ధితో తప్పనిసరి



రాచవారిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్

మద్దిపాడు: శనగ పంట వేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కీర్తిపాడు , రాచవారిపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాటారు. రైతులు శనగలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి 1 కేజీ విత్తనాలకు 8 గ్రాములు చొప్పున విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ట్రైకోడెర్మావిరిడి అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. శనగ పంటలో కలుపును నివారించుకోవడానికి స్టాంప్(పెండి మిథాలిన్) ఎకరాకు 1 లీటర్ చొప్పున శనగ విత్తిన 24 గంటల్లోపు పొలంలో చల్లించుకోవాలన్నారు. ప్రస్తుతం శనగ విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద వీఏఏల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట వీఏఏ చాందిని, రాచవారిపాలెం కీర్తిపాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మొక్కలతో పచ్చదనం

ఒంగోలు సిటీ: ఏకేయూలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టరు హర్షప్రీతం దేవకుమార్ వివిధ రకాల మొక్కలను మంగళవారం నాటారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు మొక్కలు పెంపకానికి భూమి అనువుగా ఉందన్నారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

50 మంది రక్తదానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

సంతనూతలపాడు: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఒంగోలులోని పోలీస్ కల్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్ బాబు ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం నుంచి నేతలు, యువకులు రక్తదానం చేశారు. పోలీస్ సేవలకు గుర్తుగా తామంతా మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నామన్నారు. శిబిర ముఖ్య నిర్వాహకులు ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో రక్తదానం చేసిన నాయకులకు, యువకులకు ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోల్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.



విల్లు ఎక్కు పెట్టిన కృష్ణుని పాత్రధారి (ఫైల్)



నరకాసురుని గురించి పద్యం ఆలపిస్తున్న సత్యభామ వేషధారి (ఫైల్)



నరకాసుర వధ చూసేందుకు తరలిన జనం (ఫైల్)

విజయీ భవ!

- నేటి రాత్రి నుంచి నరకాసుర వధ నాటక రూపకం
- రాత్రి 12 గంటల నుంచి ప్రారంభం...
- తెల్లవారుజామున ప్రధాన ఘట్టం
- సంస్కృతిని కాపాడటంలో ఒంగోలు నగర పాత్ర అమోఘం

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లాలో కవులు, కళాకారులకు కొదువ లేదు. ఎందరో మహానుభావులు కళామతల్లి సేవలో నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. అలాగే విశేష సంస్కృతీ సంప్రదాయాలను కొత్తతరం వారికి పరిచయం చేస్తూ.. పాత కాలం నాటి మధురానుభూతులను నెమరువేసుకొనేలా చేయడంలో ఒంగోలు వాసులు ముందుండటం విశేషం. అలాంటి ఓ నాటక రూపకమే నరకాసుర వధ.

దీపావళికి అంటే కేవలం టపాసులు పేల్చడమే కాకుండా ఓ ఊరేగింపుగా కదులుతూ నరకాసుర వధ నాటకాన్ని రక్తికట్టించడంలో విభిన్నత అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. 110 ఏళ్ల క్రితం కొంతమందిలో మొదలైన ఈ ఆలోచన నేడు విస్తృత రూపానికి చేరుకుంది.. మన పండగల ఔన్నత్యాన్ని చాటడమే లక్ష్యంగా కొందరు చేపడుతున్న కృషి ప్రశంసనీయం. 110 ఏళ్ల క్రితం ఒంగోలు గ్రామంగా ఉండేది. ఆనాడు ప్రజలకు నాటక రూపాలు, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట వంటివే వినోదాన్ని పంచేవి. ఈ క్రమంలో తూర్పుపాలెం యువజన మిత్రమండలి వచ్చిన ఆలోచనే నరకాసుర వధ నాటక ఘట్టానికి నాంది పలికింది.

ఏమిటీ కళా రూపకం?

నరకాసుర వధ ఘట్టం ఆద్యంతం ఉత్సాహంగా సాగుతుంది. స్థానిక కొత్త పట్నం బస్టాండులోని రాజరాజేశ్వర శివాలయం నుంచి నరక చతుర్దశి రోజు రాత్రి 12 గంటలకు.. ముందుగా అలంకరించిన ఓ వాహనం బయలుదేరుతుంది. అందులో శ్రీకృష్ణ పరమాత్ముడు, సత్యభామ, పాత్రధారులుంటారు. వీరు పద్యాలు పాడుతూ, ఒంగోలు రంగుతోట నుంచి మిరియాల పాలెం మీదుగా గాంధీ రోడ్డుకు చేరుకుంటారు.

ఒంగోలు నగర ప్రజలు ఆనందంతో వారిని స్వాగతిస్తారు. నాటక రూపంలో భాగంగా.. శ్రీకృష్ణుడు సత్యభామ నగర సంచారం చేస్తున్నారని తెలుసుకొని.. నరకాసురుడు, అతని సహచరుడు రాక్షసుడు అయిన వజ్రకంతుడు వేషధారులు మరో వాహనంపై బయలు దేరుతారు. ఈ రెండు వాహనాలు తెల్లవారుజామున గాంధీ రోడ్డులో తారసపడతాయి. దీంతో పాత్రధారులంతా రంగంలోకి దిగుతారు.. పరస్పరం నువ్వెంత అంటే నువ్వెంత అంటూ పద్యాలు పాడుతూ సవాళ్లు ప్రతి సవాళ్లు విసురుకుంటారు. ఈ ఘట్టాన్ని చూస్తున్న ఒంగోలు నగర ప్రజలు ఈలలు కేకలు చప్పట్లతో వేషధారులను హుషారు పరుస్తుంటారు. ఇంతలో యుద్ధం మొదలవుతుంది. కృష్ణుడు నరకాసురుడు చేతిలో మూర్ఛపోతాడు. తన పతిదేవుడు మూర్ఛపోవటం చూసిన సత్యభామ కృష్ణుడు చేతిలో ఉన్న విల్లు ఎక్కుపెట్టి నరకాసురుడిని అంతం చేస్తుంది. ఇలా నరకాసురుడి వధ అనంతరం నగర ప్రజలంతా ఆనందోత్సాహాలతో బాణసంచా కాల్చి దీపావళి పండగను వేడుకగా జరుపుకుంటారు. అయితే ఈ నాటకంలో వేసిన పాత్రలన్నీ పురుషులే వేయడం ఒక విశేషం కాగా.. వారి వంశపారం పర్యంగానే పాత్రలు వేస్తూ రావడం మరో ప్రత్యేకత.

ఈ పౌరాణిక సజీవ నాటక ప్రదర్శనలో భాగంగా ఒంగోలు పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ నిర్వహించే 39 అడుగుల ఎత్తయిన నరకాసురుని బొమ్మను దహనం చేసే ఘట్టం కూడా పూర్తయితేనే నగర వాసులకు దీపావళి వచ్చినట్లు భావిస్తారు.



మంటల్లో కాలుతున్న నరకాసురుడు (ఫైల్)

30 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు



గత 43 సంవత్సరాల నుంచి ఒంగోలు నగరంలో నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. 30వ తేదీ బుధవారం రాత్రి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు మొదలవుతాయి. తెల్లవారితే 31 గురువారం మూడు నాలుగు మధ్య పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర 39 అడుగుల ఎత్తులో ఉండే నరకాసుర బొమ్మ వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

– తాతా బదరీనాథ్, ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు, సూపర్ బజార్ మాజీ చైర్మన్

ప్రతి సంవత్సరం ఎత్తు పెరిగే నరకాసురుడు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నరకాసురిని బొమ్మ (ఫైల్)

ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1981 లో మొదలైన నరకాసుర దహన కార్యక్రమం సుమారు 43 సంవత్సరాల నుంచి నిర్విఘ్నంగా సాగుతోంది. ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు దీనికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీపావళి పండగలోని అంతరార్థాన్ని నేటి తరానికి తెలపాలనే ఉద్దేశంతో ఈ వేడుకను ఆరంభిస్తారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర గురువారం తెల్లవారుజామున మూడు నాలుగు మధ్యలో నరకాసురవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 30వ తేదీ బుధవారం అర్ధరాత్రి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ వారు మొదట 25 అడుగుల ఎత్తయిన నరకాసురుని వధతో శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా నరకాసురుని ఎత్తు పెంచుకుంటూ పోతున్నారు. అలా ఈ సంవత్సరం 39 అడుగులు ఎత్తయిన నరకాసురుని దహనాన్ని ఒంగోలు నగర ప్రజలకు వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు వారి కార్యక్రమాలను రూపకల్పన చేసే విధానం కూడా ఒక ప్రత్యేకత. ఉత్తరం వైపు ఏర్పాటు చేసి వేదిక పై యువతీ యువకులు నృత్య ప్రదర్శనలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొని

ఉత్సాహంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీలు



పరుగుపందెం



బ్యాడ్మింటన్ పోటీలకు టాస్ వేస్తున్న క్రీడాభివృద్ధి శాఖ అధికారి



క్యారమ్స్‌లో పోటీపడుతున్న ఉద్యోగులు

ఒంగోలు: సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు ఉత్సాహంగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి గుంటి రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగాయి. క్యారమ్స్, బ్యాడ్మింటన్, పరుగుపందెం, చదరంగం ఆటలకు సంబంధించి ఎంపిక జరిగింది.

విజేతలు:

అథ్లెటిక్స్: ఎం.రాజశేఖర్, డి.బాలరాజు, ఎం.కోటేశ్వరరావు, కె.సురేంద్రకుమార్, వై.మాధవరావు, కె.జగదీశ్వరి, ఎం.మాధవీలత, ఎ.శిరీషకుమారి, ఎస్.అరుణ, ఉషారాణి.

బ్యాడ్మింటన్: కేకే సైమన్, కె.విజయభాస్కర్, బి.నారాయణ మహేంద్ర, వి.వెంకటేశ్వర్లు

చదరంగం: ఎస్.ప్రసాద్, కె.జగదీశ్వరి, కేటీ శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, డి.హుస్సేన్, జెఎం శివప్రసాద్, ఎస్.శ్రీదేవి, ఐ.అశోక్‌రెడ్డి

క్రికెట్: కేకే సైమన్, కె.కళ్యాణ్, బి.రాజశంకర్, కె.వెంకట నాగేశ్వరరావు, కె.సత్యన్నారాయణ

క్యారమ్స్: ఎస్‌కె మస్తాన్‌వలి , కె.విజయభాస్కర్

జీవనశైలి మార్పులతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: ఆధునిక జీవన శైలి ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, జీవన శైలి మార్పులతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అన్నారు. ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా వైద్య కళాశాల లెక్చర్ హాలులో మంగళవారం క్యాన్సర్, డయాబెటిస్, రక్తపోటు వ్యాధులపై శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతులకు డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార నియమాలు పాటించకపోవడంతో పాటుగా సరైన వ్యాయమం చేయకపోవడం, పొగతాగడం లాంటి వాటి వల్ల క్యాన్సర్ ప్రబలుతుందని చెప్పారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ దుర్గాదేవి సూచించారు. తరగతుల్లో నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ల గురించి వివరించారు. రొమ్ము క్యాన్సర్‌ను సొంతంగా ఎలా పరీక్షించుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు, జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి, వైద్యులు శ్రీనివాసరెడ్డి, ప్రియాంక, సంధ్యారాణి, నరేంద్ర పాల్గొన్నారు.

గ్రానైట్ భద్రతా వారోత్సవాలు జయప్రదం చేయండి



భద్రతా వారోత్సవాల గురించి వివరిస్తున్న బదరీనారాయణ

చీమకుర్తి: గ్రానైట్ భద్రతా వారోత్సవాలను జయప్రదం చేయాలని వారోత్సవాల కమిటీ కన్వీనర్, గెలాక్సీ గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ పిలుపునిచ్చారు. గ్రానైట్ యజమానుల ఆధ్వర్యంలో మంగళవారం రామతీర్థం వీటీసీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారోత్సవాల నిర్వహణ, ముగింపు వేడుకలను గురించి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గెలాక్సీ గ్రానైట్, ఆర్ఆర్ఆర్ గ్రానైట్ క్వారీల ఆతిథ్యంలో భద్రతావారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రానైట్ రీజియన్–3 పరిధిలోనున్న ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన గ్రానైట్ యజమానుల ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు నవంబర్ నెల 17న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా కార్మికుల వృత్తికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేసే ట్రేడ్ టెస్ట్‌లను ఈనెల 21 నుంచి 26 వరకు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వచ్చే నెల 4 నుంచి గ్రానైట్ క్వారీల తనిఖీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 17న నిర్వహించే ముగింపు వేడుకల్లో గ్రానైట్ క్వారీలలో ప్రతిభ, వృత్తి నైపుణ్యతను చాటిన వారికి బహుమతులను అందిస్తామని తెలిపారు. రీజియన్ 3 పరిధిలోని గ్రానైట్ యజమానులు, మేనేజర్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దిపాడు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని ఒంగోలు జాతర దాబా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై వెనుక కూర్చొని ఉన్న మహిళల కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా ఒంగోలు జీజీహెచ్ తరలించారు.

రహదారిపై కొండచిలువ



జాతీయరహదారిని దాటుతున్న కొండచిలువ

మద్దిపాడు:మండలంలోని వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి వద్ద కొండచిలువ కలకలం సృష్టించింది. ఇటీవల భారీగా వర్షాలు కురిసిన నేపథ్యంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో ఉన్న గార్లపాడు, ఘడియపూడి గ్రామాలు మునిగిన సందర్భంలో కొండ చిలువలు భారీగా సంచరిస్తున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి సమయంలో వెల్లంపల్లి సమీపంలో కొండచిలువ జాతీయరహదారిని దాటుతూ కనిపించింది. అది సుమారు 14 నుంచి 15 అడుగుల మేర ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వల్లూరమ్మ ఆలయం వద్ద టంగుటూరు వైపు వెళ్లే హైవేపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా.. ఓ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి సుమారు 40 ఏళ్ల ఉండవచ్చు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యవసాయంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి పి.పావని

సంతనూతలపాడు: మండలంలోని కామేపల్లివారి పాలెం, మంగమూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారి పి.పావని రైతులతో మాట్లాడారు. ఈ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను మండల వ్యవసాయ అధికారిణి రైతులకు అందజేశారు. వ్యవసాయ సహాయకులని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. రాయితీపై శనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం శనగ పంట సాగు చేసే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుని రాయితీపై వ్యవసాయ శాఖ వారు ఇచ్చే శనగ విత్తనాలను పొందాలని సూచించారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధికారి ఎస్ .పి.వెంకన్నబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కె.వి. సుబ్బారెడ్డి, కామేపల్లి వారి పాలెం, మంగమూరు గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ.దుర్గాప్రసాద్, షేక్ అబ్జల్ మరియు రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు 40 అర్జీలు



మాట్లాడుతున్న సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: మండలంలోని పి.తక్కెళ్ళపాడులో మంగళవారం జరిగిన రీ సర్వే రెవెన్యూ గ్రామ సభకు 40 అర్జీలు దాఖలయ్యాయి. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీపీ బుడంగుంట విజయ గ్రామ సభకు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. రీ సర్వేను రైతులు సద్వినియోగపరచుకోవాలని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి కోరారు. రైతులకు సంబంధించి పొలాలు సమస్యలుంటే తెలియజేయాలని.. 45 రోజుల్లో ఆయా సమస్యలను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

డీటీ ఎన్. మాబు సుభాని, తక్కెళ్ళపాడు వీఆర్‌ఓ కె. శ్రీదేవి, మండల ఇన్‌చార్జి సర్వేయర్ ఏ. ప్రవీణ్ కుమార్, ఆర్ఐ. పి. రామ్ తేజ, గ్రామ సర్వేయర్ ఎం.బ్రహ్మయ్య, ఉప సర్పంచ్ పి. సుజాత, మాజీ సర్పంచ్ బండారు లక్ష్మీనారాయణ, గ్రామాల సర్వేయర్స్ రమణమ్మ, బ్రహ్మేంద్ర, మాధవరావు, హరికృష్ణ, రుద్రవరం వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు అర్బన్: జరిగిన రీ సర్వేపై తహసీల్దారు వాసు ఆధ్వర్యంలో మంగళవారం సర్వేరెడ్డిపాలెంలో గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేపై అభ్యంతరాలు తెలిపేందుకు, ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ నాళం వెంకటేశ్వరరావు, రూరల్ సర్వేయర్ విష్ణువర్ధన్, వీఆర్‌ఓ ప్రవీణ్, విలేజ్ సర్వేయర్ ప్రేమ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు సన్మానం



ఉత్తమ పోలీసులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం: పోలీస్ అమల వీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ అంబేడ్కర్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు మాట్లాడుతూ మనం ప్రశాంతంగా ఉన్నామంటే పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా వారు చేస్తున్న సేవలే కారణమన్నారు. హెడ్‌కానిస్టేబుల్ కొక్కిలగడ్డ పాండురంగారావు, కానిస్టేబుల్ తురిమెళ్ల సుకన్య, మెరైన్ పోలీస్ స్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్ పులుగు రామిరెడ్డి, హోమ్‌గార్డ్ తీరప్రాంత గస్తీ పోలీస్ కోడూరి లక్ష్మణ్, హోమ్ గార్డ్ తీరప్రాంత గస్తీ పోలీస్ దండుప్రోలు వెంకటకృష్ణ, సచివాలయం–1 నుంచి ప్రతీక, మహిళా పోలీసు చింతల చెరువు లక్ష్మిని సన్మానించి పుష్ప గుచ్ఛాలు అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాయి కిషోర్, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, జిల్లా ట్రెజరర్ పర్రె వెంకట్రావు, గైడ్స్ కెప్టెన్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు సీహెచ్ కోటేశ్వరరావు, కోడూరి ధనలక్ష్మి, కృష్ణమూర్తి, శరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.